ప్రజాశక్తి

మంగళవారం 22 అక్టోబర్ 2024 5 విజయనగరం

## నేలకొరిగిన వరి... అన్నదాత ఆవేదన


గాలులకు నేలకొరిగిన వరి

ప్రజాశక్తి - వంగర

మండలం లో గాలి, వాన బీభత్సానికి కొప్పర, కొండచాకరాపల్లి, కొత్తవలస, కొప్పరవలస, మద్ది వలస తదితర గ్రామాలలో వరిపంట వందల ఎకరాలలో నేల కొరిగింది. ఎన్నో అప్పులు చేసి, కష్టించి పండించిన పంటను ఇంతవరకు రక్షించుకున్నప్పటికీ ఆదివారం వీచిన గాలి వర్షానికి చివర దశలో నేలకొరగడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

# రక్షిత నీరు ప్రజల ప్రాథమిక హక్కు

- డయేరియాతో 10మంది మరణం బాధాకరం
- నీటి కాలుష్యం, గత ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణం
- నీటి వనరులన్నిటినీ పరిశుభ్రంగా ఉంచుతాం
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- గుర్లలో బాధితులకు పరామర్శ
- మృతుల కుటుంబీలకు లక్ష చొప్పన ఆర్థిక సాయం


కలెక్టరేట్‌లో ఉమ్మడిజిల్లా అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్;


గుర్లలో పవన్ కల్యాణ్‌కు సమస్యలు వివరిస్తున్న మహిళలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / గుర్ల

రక్షిత తాగు నీటిని పొందడం ప్రజల ప్రాథమిక హక్కని, నీటి కాలుష్యంతో గుర్ల గ్రామంలో 10 మంది మరణించడం అత్యంత బాధాకరమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖా మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అన్నారు. పంచాయతీరాజ్, వైద్య శాఖలు బాధ్యతగా పని చేసి, జవాబు దారీగా వ్యవహరించాలని సూచించారు. గుర్లలోని డయేరియా మరణాల గురించి తెలుసుకునేందుకు సోమవారం గుర్ల గ్రామానికి విచ్చేశారు. ఎస్ఎస్ఆర్‌పేట సమీపంలోని చంపావతి నదిలో రక్షిత తాగునీటి పథకాన్ని అధికారులతో కలిసి తొలుత పరిశీలించారు. అనంతరం గుర్ల పిహెచ్‌సిలోని రోగులను పరామర్శించారు. ఆ తరువాత గ్రామస్తులతో ముఖాముఖీ భేటీ అయ్యారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ సరిగా లేదని, చావులు ఆగకపోయినా తమను పట్టించుకోవడం లేదని కొందరు పవన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వినతినిచ్చేందుకు వచ్చిన వికలాంగులతో రహదారిపై కూర్చొని పవన్ కళ్యాణ్ మాట్లాడారు. అనంతరం విజయనగరంలోని కలెక్టరేట్‌కు చేరుకుని డయేరియాపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా, డయేరియా బయటపడం, ఆ తరువాత వైద్యసదుపాయాల కల్పన తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నీటి కాలుష్యం వల్ల డయేరియా ప్రబలి నట్టు ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు. బహిరంగ మల విసర్జన కూడా మరో కారణంగా అధికారులు గుర్తించినట్టు తెలిపారు. బహిరంగ మల విసర్జన వెంటనే ఆపకపోతే జనజీవనం ప్రమాదకరంగా మారుతుందన్నారు. నదీ పరివాహక ప్రాంతాలకు ఆనుకొని వున్న ప్రాంతాలలో చెత్తా చెదారం, బహిరంగ మల విసర్జనపై ప్రభుత్వంతో పాటు ప్రజలకు బాధ్యత ఉంటుందని అన్నారు. జల జీవన్ మిషన్ నిధులు గత 5ఏళ్ళలో దుర్వినియోగం అయ్యాయని, రాష్ట్ర ప్రభుత్వ వాటా విడుదల చేయలేదని విమర్శించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు గానీ, పంచాయతీ నిధులు గానీ విడుదల చేయాలన్నారు. దీంతో, అధికారులు కనీసం వాటర్ ట్యాంక్‌ల ఫిల్టర్లను కూడా మార్చలేకపోయారని విమర్శించారు. వీటిని సరిదిద్దాలనే ఉద్దేశంతోనే ఈనెలలోనే జెజెఎం రాష్ట్ర వాటా నిధులను మంజూరు చేశామన్నారు. ఉత్తరాంధ్ర లో వాగులు, గెడ్డలు పరిశుభ్రంగా ఉండేలా చూస్తామని, అన్నిటికి గాట్లను కట్టి పరిశీలిస్తామని, కాలుష్యాన్ని అరికట్టడానికి డంపింగ్ యార్డులను కూడా దూరంగా ఉంచాలని అన్నారు. నిధుల కోసం అవసరమైతే ప్రధాని తో మాట్లాడి నిధులు కోసం ప్రయత్నం చేస్తానని అన్నారు.

కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ మొదటి డయేరియా కేసు ఈనెల 14 న గుర్తించామని, ఆ రోజే నీటి పరీక్షలు చేపట్టి, చంపావతి నీటి సరఫరాను నిలిపివేశామన్నారు. వ్యక్తిగత బోర్ల వినియోగాన్ని కూడా నిలిపివేశామన్నారు. ప్రస్తుతం నాగావళి నది నీటిని క్లోరినేషన్ చేసి టాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. గుర్ల గ్రామంలో ఇప్పటికీ మెడికల్ క్యాంపు కొనసాగుతోందని తెలిపారు. బహిరంగ మల విసర్జన వలన కూడా నీటి వనరులు కలుషితమైనట్లు భావిస్తున్నామని తెలిపారు.


గుర్లలో వికలాంగుల సమస్యలు వింటున్న పవన్ కల్యాణ్

పెద పెంకిలో బోద వ్యాధి వ్యాప్తి చెందకుండా చర్యలు

పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం పెదపెంకి గ్రామంలో బోద వ్యాధి వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని పవన్ కళ్యాణ్ ఆదేశాలిచ్చారు. పెద పెంకిలో నెలకొన్న బోద వ్యాధి సమస్య, ఆ వ్యాధి నిరోధానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. బోద వ్యాధి వ్యాప్తి చెందకుండా పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. పరిసరాలు పరిశుభ్రత, ఇతర ఆరోగ్య చర్యలు తీసుకోవాలన్నారు. మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో పారిశుధ్య కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టామని చెప్పారు. తాగు నీటి పథకాల వద్ద శుభ్రత పాటించడటం తోపాటు క్లోరినేషన్ చేస్తున్నామన్నారు. గ్రామంలో 19 రౌండ్లు మందులు సరఫరా చేశామని, మైక్రో ఫైలేరియా లార్వా సర్వే కోసం ప్రణాళికలు తయారు చేశామని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పల నాయుడు, ఎమ్మెల్యేలు కిమిడి కళా వెంకట రావు, అదితి గజపతిరాజు, కోళ్ళ లలిత కుమారి, లోకం నాగ మాధవి, పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వర్రావు, స్వచాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి గంధం చంద్రుడు, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర రావు, డిపిఒ వెంకటేశ్వర రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమా శంకర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ సరిత, అటవీశాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, బిజెపి జిల్లా కార్యదర్శి ఉప్పలపాటి రాజేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

విద్యా, వసతి దీవెన

## బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన నిధులు విడుదల చేయాలని, ఎటువంటి షరతులూ లేకుండా పరీక్ష ఫీజులు కట్టించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు సోమవారం ఆర్టీసి కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేశాఉ. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ గత రెండేళ్లగా విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తిస్థాయిలో ఆగిపోయిందన్నారు. ప్రభుత్వం ఇచ్చే హామీ ద్వారానే విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలో జాయిన్ అయ్యారని, పూర్తిస్థాయిలో విద్యా, వసతి దీవెన డబ్బులు ఇవ్వకపోవడం వల్ల విద్యార్థులు కళాశాలలకు ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా ఫీజులు పెట్టడం సరికాదని, కళాశాల ఫీజు చెల్లిస్తే గాని పరీక్ష ఫీజు తీసుకోబోమని విద్యార్థులను బాగా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించకపోతే విద్యార్థులు ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు. ధర్నా అనంతరం సమస్యలపై జాయింట్ కలెక్టర్‌కు వినత అందజేశారు. ఎటువంటి షరతులు లేకుండా పరీక్ష ఫీజులు చెల్లించుకునే విధంగా డిగ్రీ కళాశాలకు ఆదేశాలు పంపిస్తామని, నిధుల విడుదల చేయాలని ఉన్నతాధికారులకు అడుతామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జై రవికుమార్, ఎం. వెంకటేష్, జిల్లా సహాయ కార్యదర్శులు జగదీష్, శిరీష, రమేష్, జిల్లా కమిటీ నాయకులు కె.రాజు గుణ, తేజ, రాహుల్ పాల్గొన్నారు.

## కబడ్డీలో రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలబెడతాం

- కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీ కాంత్
- జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా రంగారావుదొర, ప్రభావతి


ఎన్నికైన కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రాన్ని కబడ్డీ ఆటలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామనిరాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీకాంత్ అన్నారు. సోమవారం జరిగిన విజయనగరం జిల్లా కబడ్డీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ కలిగిన క్రీడాకారులను తయారు చేసి దేశానికి అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేసేందుకు జిల్లా అసోసియేషన్ సహకారాన్ని అందించాలన్నారు. కబడ్డీ ప్రతిష్టను పెంచే విధంగా జిల్లా నూతన బాడీ పనిచేయాలన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా చైర్మన్‌గా ఐవిపి రాజు, అధ్యక్ష కార్యదర్శులుగా ఎ.రంగారావుదొర, కెవి ప్రభావతి ఎన్నికయ్యారు. వీరితో పాటు 16 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో పరిశీలకులుగా అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సుబ్బరాజు, వర్కింగ్ అధ్యక్షులు అర్జునరావు, డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు, టి.భగవాన్ దాస్ వాలీబాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, సీనియర్ క్రీడాకారులు శ్రీను రాంబాబు, నాంచారయ్య లక్ష్మణరావు, క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి రాంబాబు పాల్గొన్నారు.

## తుపానును ఎదుర్కొనేందుకు యాక్షన్‌ప్లాన్

### గ్రామాలకు ప్రత్యేకాధికారుల నియామకం : కలెక్టర్



ప్రజాశక్తి-విజయనగరంకోట

తుపానును ఎదుర్కొనేందుకు మండలాల వారీగా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. తుఫాను కారణంగా బుధ, గురువారాల్లో జిల్లాలో అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, వీటిని ఎదుర్కొనేందుకు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారులు, ఆర్‌డిఒలు, తాసిల్దార్లు, ఎంపిడిఓలు, ఇఒపిఆర్‌డిలతో కలెక్టరేట్ నుంచి ఆయన సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఈనెల 22 నుంచి 26 వరకు స్పెషల్ ఆఫీసర్లతో సహా మండల అధికారులంతా ఆయా మండలాల్లోనే ఉండాలన్నారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకూడదని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాలను ముందే గుర్తించి, ప్రజలను తరలించాలన్నారు. అన్ని వసతులతో పునరావాస శిబిరాలను సిద్ధం చేయాలన్నారు. ముందు జాగ్రత్త చర్యలతో మంగళవారం సాయంత్రానికి మండల వారీగా యాక్షన్‌ప్లాన్ రూపొందించి అందజేయాలని ఆదేశించారు. గుర్ల డయేరియా సంఘటన నేపథ్యంలో జిల్లా అంతటా రేపటినుంచి పదిరోజులపాటు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజూ తాగునీటి పథకాలను క్లోరినేషన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాలను మండల ప్రత్యేక అధికారులు, గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఓ ఎస్‌డి అనిత పాల్గొన్నారు.

### తాగునీటి పంపిణీ పై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర వ్యాప్తంగా జరుగుతున్న నీటి పంపిణీ విధానం పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఇంజినీరింగ్ సిబ్బందికి, ఎమినిటీస్ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య ఆదేశించారు. ప్రతి 15 రోజులకు వాటర్ ట్యాంకులను శుభ్రపరచాలని ఆదేశించారు. తరచూ నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని చెప్పారు.

## నేడు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాక

### గుర్ల డయేరియా ఘటనపై విచారణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

గుర్ల గ్రామంలో కలుషిత జలాల కారణంగా డయేరియా ప్రబలి పలువురి మృతికి కారణమైన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక విచారణ అధికారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలో అధికారులతో సమావేశమై ఈ ఘటనకు కారణాలను తెలుసుకుంటారు. అనంతరం గుర్ల బయలుదేరి వెళ్లి అక్కడ స్థానికులతో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకుంటారు. అనంతరం ఈ ఘటనపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు

## జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పల్లవికి పతకాలు



ప్రజాశకి-విజయనగరం టౌన్

హిమాచల్ ప్రదేశ్ లో అక్టోబర్ 6నుంచి 13 వరకు జరిగిన జాతీయ యూత్ జూనియర్ అండ్ సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో విజయనగరం సత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎస్.పల్లవి 71 కేజీల క్యాటగిరి సీనియర్ విభాగంలో 94 కేజీలు స్నాచ్,114 కేజీ క్లీన్, జర్క్ 208కేజీలు బరువెత్తి రెండు రజత పతకాలు సాధించింది. ఈ సందర్భంగా కాలేజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని అన్నారు. పల్లవి కషి పట్టుదల వలననే ఈ విజయం సాధ్యమైందని, భవిష్యత్తు లో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎం.సత్య వేణి, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ చల్లా రాము, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూరపు నాయుడు, లెఫ్టినెంట్ ఉదయ్ కిరణ్, కళాశాల ఫిజికల్ డైరక్టర్ హెచ్ హెచ్ ప్రసాద్,అధ్యాపకులు పాల్గొన్నారు.

### బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పూర్తి

విజయనగరం టౌన్ : విజయనగరం ఇండోర్ స్టేడియం లో స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో అండర్ 14,17 విభాగంలో జరిగిన బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక పూర్తయ్యాయి. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణంరాజు వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా వినతుల పరిష్కార వేదికకు 180 అర్జీలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావినతుల పరిష్కార వేదికకు 180 వినతులు వచ్చాయి. వినతులకు నాణ్యమైన, ఖచ్చితమైన సమాధానాలు ఇవ్వాలని, రీ ఓపెన్ చేసే పరిస్థితి లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. ప్రజా వినతులు పరిష్కార వేదిక లో భాగంగా సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్ఒ ఎస్.డి. అనిత ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 180 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంబంధించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 122 వినతులు అందాయి. పింఛన్లు మంజూరు చేయాలని తదితర అంశాలపై డిఆర్‌డిఎకు 17వినతులు అందాయి. మున్సిపాలిటీకి 5 , పంచాయతీ శాఖకు 12, విద్యాశాఖకు 4 అందగా, వైద్యశాఖకు 6 అందాయి. తమను విధుల్లో కొనసాగించాలని ఎఐటియుసి ఆధ్వర్యాన వాలంటీర్లు ధర్నాచేశారు.

## అంగన్‌వాడీ హెల్పర్ తొలగింపు చర్యలు మానుకోవాలి

### ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా



సిడిపిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని రామన్నపేటలో అంగన్‌వాడీ హెల్పర్‌గా పనిచేస్తున్న మానాపురం సౌజన్యను రాజకీయంగా వేధిస్తూ, కక్షపూరిత తొలగించేందుకు చేస్తున్న చర్యలను మానుకోవాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన సోమవారం ఐసిడిఎస్ సిడిపిఒ కార్యాలయం వద్ద ధర్నాచేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, యూనియన్ జిల్లాగౌరవాధ్యక్షులు వి.లక్ష్మి మాట్లాడారు. రామన్నపేట గ్రామ సర్పంచ్ దురుద్దేశంతోనే రాజకీయ వేధింపుల్లో భాగంగా హెల్పర్ సౌజన్య తప్పుడు సర్టిఫికెట్లు పెట్టిందని, ఆ గ్రామంలో నివాసం లేదని ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేశారని అన్నారు. దానికి అత్యుత్సాహంతో ఐసిడిఎస్ అధికారులు ఆమెను ఉద్యోగం నుంచి తొలగిం చేందుకు రంగం సిద్ధం చేశారన్నారు. ఆమె ఆ గ్రామ నివాసి కాదని ఆరోపణలు చేస్తూ విధుల నుంచి తొలగించాలని చూస్తున్నారని అన్నారు. ఆమె ఆ గ్రామ కోడలని, అక్కడే ఉంటున్నారని, తన సర్టిఫికెట్లు అన్నీ సక్రమంగానే ఉన్నాయని తెలిపారు. ఈ తప్పులను సరిదిద్ది హెల్పర్‌ను కొనసాగించాలని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేసేందుకు వెళ్తే ఉదయం 10 గంటల నుంచే ఐసిడిఎస్ ఆఫీసుకి తాళాలు వేసి సిబ్బంది లోపల ఉన్నారని అన్నారు. సౌజన్యకు ఉద్యోగం ఇచ్చినప్పుడు అధికారులకు తప్పుడు సర్టిఫికెట్లు కనిపించలేదా అని నాయకులు ప్రశ్నించారు. తప్పు చేశారు కనుకే అధికారులు భయపడి తాళాలు వేసుకున్నారని అన్నారు. పీడీతో మాట్లాడడంతో వినతి తీసుకునేందుకు వచ్చారన్నారు. సౌజన్యను ఉద్యోగం నుంచి తీస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రేపటికల్లా సమస్యను పరిష్కరించకపోతే 23న ఐసిడిఎస్ పీడీ ఆఫీసు వద్ద ముట్టడి కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పిఒకు వినతినిచ్చారు. ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ సుభాషిని, నాయకులు పి.జ్యోతి, పద్మ, సౌజన్య, దమయంతి అంగన్వాడీలు పాల్గొన్నారు

## గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

ప్రజాశక్తి-విజయనగరం కోట

గ్రామాల అభివృద్ధికే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. పల్లెపండగ లో భాగంగా సోమవారం ద్వారపూడి, గుంకలాం, జొన్నవలస, దుప్పాడ గ్రామాల్లో 'పల్లె బాట' కార్యక్రమంలో పాల్గొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సభలు నిర్వహించి గ్రామాలకు కావలసిన రోడ్లు కాలువలు వీధిలైట్లు అనేక సదుపాయాలను కల్పించుకోవడానికి గ్రామసభలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు ఎంపిటిసిలు రాజేష్ బాబు, వేచలపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అమరుల త్యాగాలను మరువలేం

- పోలీసు త్యాగాల వల్లే సమాజంలో స్వేచ్ఛ
- ఎంఎస్ఎంఇ శాఖామంత్రి శ్రీనివాస్
- పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం


అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, పోలీసులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

పోలీసుల త్యాగాల వల్లే సమాజంలో స్వేచ్ఛగా జీవిస్తున్నామని, అమరుల త్యాగాలను మరువలేమని రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సోమవారం జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమరుల స్మృతి స్థూపం వద్ద మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి, కలెక్టరు బిఆర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్, అదనపు ఎస్పీ సౌమ్యలత, విధి నిర్వహణలో మృతి చెందిన చిట్టిపంతుల చిరంజీవిరావు, షేక్ ఇస్మాయిల్, ఎస్.సూర్యనారాయణ కుటుంబ సభ్యులు, పలువురు డిఎస్‌పిలు, సిఐలు, ఆర్ఐలు నివాళులర్పించారు. దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో ఈ ఏడాది అమరులైన 216మంది పోలీసుల వివరాలతో కూడిన పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

రిజర్వు ఇన్‌స్పెక్టరు ఎన్.గోపాల నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు పరేడ్ నిర్వహించగా, అమరులకు తుపాకుల విన్యాసంతో నివాళులు అర్పించారు. అనంతరం పోలీసులనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ ప్రజారక్షణలో పోలీసులు విధులను నిర్వహిస్తూ కొన్నిసార్లు ప్రాణాలను సైతం కోల్పోయే పరిస్థితి వస్తున్నదని అన్నారు. పోలీసు వ్యవస్థ సమర్థవంతంగా పని చేస్తేనే దేశంలో ప్రజలందరూ సుఖంగా ఉంటారని అన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎంతో ధైర్య, సాహసాలతో మావోయిస్టుల చర్యలను ఎదుర్కొంటూ విధులు నిర్వహించి అమరులైన ముద్దాడ గాంధీ, చిట్టిపంతుల చిరంజీవి, షేక్ ఇస్మాయిల్, బి.శ్రీరాములు, ఎస్.సూర్య నారాయణ నేడు మన మధ్య లేనప్పటికీ, వారి త్యాగాలను మరువలేమని అన్నారు.

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర ఎనలేనిదన్నారు. ఎస్‌పి వకుల్‌జిందాల్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసులు మనందరిలో చిరంజీవులుగా నిలిచిపోయారన్నారు. అంతేకాకుండా, పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా ఈనెల 21 నుంచి 31 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం పోలీసు అమరుల కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకొని, వారికి వండ్లు, నగదును అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయం నుండి దిశ పోలీసు స్టేషను వరకు పోలీసు అధికారులు, సిబ్బంది పోలీసు అమరవీరుల సేవలను కీర్తిస్తూ, ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపి కలిశెట్టి అప్పల నాయుడు, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు, పోలీసు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు , సిబ్బంది

**అమరుల కుటుంబాలకు అండగా ఉంటాం : ఎస్‌పి**

పోలీసు అమర వీరుల కుటుంబాలతో జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ జిల్లా పోలీసు కార్యాలయంలో మమేక మయ్యారు. షేక్ ఇస్మాయిల్ సతీమణి షేక్ బాబీ జాన్, ఎస్.సూర్యనారాయణ రెడ్డి సతీమణి రాజు, చిట్టిపంతుల చిరంజీవిరావు సతీమణి విశాలాక్షిలతో మమేకమై, వారి యోగ, క్షేమాలు, పిల్లల చదువు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారందరితో కలిసి ఎస్‌పితో పాటు ఇతర పోలీసు అధికారులు అల్పాహారం చేశారు.

**వీరుల ప్రాణత్యాగాలను స్మరించుకోవాలి**

విధి నిర్వహణలో ఉంటూ ప్రాణాలు త్యాగాలు చేసిన వీరులను స్మరించుకోవాలని పిటిసి ప్రిన్సిపల్ డి. రామచంద్రరాజు అన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరుల స్మారక స్తూపంవ వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవలో ఉండే పోలీసు నుంచి నీతి, నిజాయితీ, అంకితభావం, మానవత్వం, త్యాగం వంటి లక్షణాలను సమాజం ఆశిస్తుందని అన్నారు. ఎంత చేశామన్నది కాదు, ఎలా చేశామన్నది ముఖ్యమని అన్నారు. ఇరవై నాలుగు గంటలు ప్రజల మధ్య ఉండే పోలీసు నుంచి కూడా ఇటువంటి విలువలనే సమాజం కోరు కుంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పివి అప్పారావు, డియస్‌పిలు సిహెచ్‌వి రామారావు, టి.రమేష్, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## 24న మెగా జాబ్ మేళా

**శృంగవరపుకోట:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీ గురువారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్. కేశవరావు, జవహర్ నాలెడ్జి సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.ఈరన్న సోమవారం తెలిపారు. ఈ జాబ్ మేళాకు పదవ తరగతి నుంచి పీజీ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాలు వయస్సు గల వారు ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఆధార్ కార్డుతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెమినార్ హాల్లో నిర్వహించనున్న మేళాకు హాజరు కావాలన్నారు. ఈ జాబ్ మేళాకు హెటేరో డ్రగ్స్, జెస్ట్ డయల్ లిమిటెడ్, భారత్ పే, గ్లాండ్ ఫార్మ, శ్రీ రామ్ ఫైనాన్సు లిమిటెడ్ బహుళ జాతి కంపెనీలు హాజరవుతాయని స్పష్టం చేశారు. అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేస్తారని ఉదయం 9 గంటలకు జాబు మేళా జరిగే ప్రదేశానికి హాజరు కావాలని కోరారు.

## రక్షణగోడకు నిధులు మంజూరు చేయాలి

**వేపాడ:** మండలంలోని సింగరాయి గ్రామంలో గల ఎస్‌సి కాలనీ చుట్టూ చెరువు నీరు ఊట రాకుండా రక్షణ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త అప్పారావు కలెక్టర్‌ను కోరారు. గతంలో కలెక్టర్ శర్మరావు జిల్లా షెడ్యూల్ కులంలో సంక్షేమ సేవా సంఘం నిధులతో కాలనీ చుట్టూ రక్షణ గోడ ఏర్పాటు చేశారని, ప్రస్తుతం ఆ రక్షణ గోడ శిథిలావస్థకు చేరడంతో నీటి ఊట గ్రామంలోకి వచ్చేస్తుందని చెప్పారు. ఇక్కడ నివసిస్తున్న 68 కుటుంబాలకు ప్రమాదాలు జరగకముందే కాలనీ చుట్టూ రక్షణ గోడకు నిదులు మంజూరు చేసి తగు చర్యలు చేపట్టాలని కోరారు.

## విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

**వేపాడ:** మండలంలోని సోంపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు ఆతవ రవిశంకర్, కెజిబివి ఎల్.కోట హిందీ సిఆర్‌టి అనురాధ దంపతులు సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని సోంపురం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో గల 10 పాఠశాలల్లో 1,2 తరగతులు చదువుచున్న 90 మంది విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. వీరందరికీ చెక్ రూల్ పుస్తకాలను ఎంఇఒ-2 పి.బాలభాస్కరరావు చేతుల మీదుగా పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులందరు బాగా చదివి ఉత్తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి రామ్‌ప్రసాద్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

**తెర్లాం** : మండల కేంద్రంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం అనే సదస్సు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ ఎఒ అప్పారావు, ఎంఇఒ త్రినాథరావు పాల్గొని మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫ్లెమింగ్ (ఎపి సిఎం ఎఫ్) యూనిట్ ఇంచార్జి తులసి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటలు తినడం వల్ల ఎలా ఆరోగ్యం కాపాడుకోవచ్చు, తక్కువ ఖర్చుతో ఎలా ఎక్కువ ఆదాయం పొందవచ్చు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిఎం టి.రాము, వెలుగు సిబ్బంది, అంగన్వాడి సూపర్‌వైజర్ ఉషారాణి పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలు

**రామభద్రపురం:** అయోడిన్ లోపాలు వాటి వల్ల వచ్చే వ్యాదుల, నివారణ చర్యలపై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు సోమవారం ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నేషనల్ అయోడిన్ డెఫ్షియన్సీ డిజార్డర్ కంట్రోల్ ప్రోగ్రాం (ఎన్ ఐడిడిసిపి)పై పాఠశాలలో ఈ నెల 17 నుంచి 19వ తేదీలలో వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. అక్టోబర్ 21 'గ్లోబల్ అయోడిన్ డిఫిషియన్సీ డిజార్డర్ ప్రివెన్షన్ డే' సందర్భంగా విద్యార్థులకు ప్రశంశా పత్రాలను అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలో గోపికా శ్రీవల్లి, నవ్యశ్రీ విజేతలుగా నిలిచారన్నారు. వీరికి అమరావతి నుంచి వచ్చిన ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు నాగభూషణరావు, దాలినాయుడు, రఘురం నాయుడు తదితర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## చీడివలసలో దోమల మందు పిచికారీ

**కొత్తవలస:** వియ్యంపేట పి.హెచ్.సి పరిధిలో గల చీడివలస, సుందరయ్య పేటలో వైద్యాధికారి ఆదేశాలు మేరకు సర్పంచ్ చలుమూరి అప్పలనాయుడు, సెక్రటరీ రాము ఆధ్వర్యంలో దోమలు నివారణకు ఏబేట్ దోమలు మందును సోమవారం పిచికారీ చేశారు. హెల్త్ సూపర్ వైజర్ ఈశ్వరరావు మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికెన్ గునియా వంటి జ్వరాలు రాకుండా దోమలు లార్వా దశలోనే ఎలిమినేట్ చేయడానికి స్ప్రేయింగ్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్స్ సత్యారావు, ఈశ్వరరావు, ఎఎన్ఎమ్ వరలక్ష్మి, ఆశ అప్పన్నమ్మ, పంచాయతీ సిబ్బంది సోంబాబు, అప్పారావు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు రాజేష్

**కొత్తవలస:** మండలంలోని మంగళ పాలెం వద్ద ఉన్న సెయింట్ ఆన్స్ పాఠశాలకి చెందిన మేడిశెట్టి రాజేష్ అండర్- 17 విభాగంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాల నుంచి మేడిశెట్టి రాజేష్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక కావడంపై, పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ కెథరిన్, పాఠశాల ప్రిన్సిపల్ సుధారాణి రాజేష్‌ని, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు భూషణ్, వెంకటరావు, జశ్వంత్‌లను అభినందించారు. శ్రీ సత్య సాయి జిల్లా, హిందూపురంలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో కూడా ప్రతిభ కనబరిచి జిల్లాకు, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దళితులకు ఇచ్చిన భూమిని అప్పగించాలి

**నెల్లిమర్ల:** ప్రభుత్వం దళితులకు ఇచ్చిన భూమిని అప్పగించాలని జై భీం రావు భారత్ పార్టీ నాయకులు టి.నరసయ్య, కె.శ్రీనివాసరావు కోరారు. సోమవారం వారు గషిణిలో ప్రభుత్వం ఇచ్చిన భూమిని అప్పగించాలని కోరుతూ తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుషిణి గ్రామంలో సర్వే నెంబర్ 266లో 5 ఎకరాలను 38 దళిత కుటుంబాలకు 2010లో అప్పటి ప్రభుత్వం డి పట్టా ఇచ్చిందన్నారు. అయితే దళితులకు ఇచ్చిన డి పట్టా భూమిలో గ్రామానికి చెందిన కొంతమంది దళితులను బెదిరించి డి పట్టా భూమిలో వ్యర్థాలు వేసి పనికి రాకుండా చేయడతో బాటు మద్యం, ఇటుక బట్టీలుపెట్టి వ్యాపారం చేస్తున్నారన్నారు. దళితుల నుంచి బలవంతంగా కాగితాలు రాయించుకున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వం దళితులకు ఇచ్చిన భూమిని సర్వే జరిపి ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకొని భూమి అప్పగించాలని వినతి పత్రంలో కోరారు.

## రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

**నెల్లిమర్ల:** రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు కొండవెలగాడ జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బి.లోకేష్, టి.చైతన్య, టి. గౌతమ్, ఎం.లక్ష్మీనారాయణ, టి.లీలాప్రసాద్ ఎంపికయ్యారని పీడీ పతివాడ శ్రీనివాసరావు తెలిపారు. నవంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు వీరంతా ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం వి.జ్ఞాన శంకర్, పాఠశాల సిబ్బంది, గ్రామపెద్దలు యవత అభినందించారు.

## రాజాపులోవ వద్ద తీరిన ట్రాఫిక్ సమస్య

**భోగాపురం:** మండలంలోని రాజాపులోవ వద్ద విశాఖ నుంచి విజయనగరం వెళ్లే రహదారిపై నుంచి ప్రవహిస్తున్న నీటిని అధికారులు సోమవారం మళ్లించారు. రహదారి పైనుంచి నీటి ప్రవాహంతో గత కొన్ని రోజుల నుంచి ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దీనిపై ప్రజాశక్తిలో రాజాపులోవ వద్ద ట్రాఫిక్ సమస్య అనే కథనం సోమవారం వెలువడింది. దీనిపై ఎస్‌ఐ పాపారావు, పంచాయతీ కార్యదర్శి మదీనా స్పందించి రోడ్డుపై ప్రవహిస్తున్న నీటిని మళ్లించారు. ఫలితంగా ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జనసేన మండల అధ్యక్షులుగా ప్రసాద్

**శృంగవరపుకోట:** జనసేన మండల సమావేశం స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి సత్యనారాయణ హాజరై మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కార్యచరణ రూపొందించామన్నారు. ఇందులో భాగంగా మండల కమిటీలు వేయాలని నిర్ణయం తీసుకున్నామని ముందుగా ఎస్‌కోట మండల పార్టీ అధ్యక్షునిగా తాండ్రంగి ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా పట్రాన రవి, పట్టణ అధ్యక్షునిగా మోపాడ చిన్ని, ఉపాధ్యక్షునిగా ఎలమంచిలి దేవుడును ఎన్నుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాలను సందర్శించిన ఎంఇఒ

**ప్రజాశక్తి - వేపాడ**

మండలంలోని కొత్తబొద్దాం ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ జి. జగదీశ్వరరావు సోమవారం సందర్శించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థులతో వేయించిన కలర్స్ నేమ్స్, మంత్స్ నేమ్స్, తోలుబొమ్మలాట పాటతో విద్యార్థులకు బోధన చేయడం పట్ల ఉపాధ్యాయులు పి.శారదాంబ, పద్మలతలకు అభినందనలు తెలిపారు. పాఠశాల ఆవరణ, కిచెన్ గార్డెన్, వంటగది, విద్యార్థులకు ఇస్తున్న మెనూ పరిశీలించారు. గతంలో పాఠశాలకు ఒక మెట్టు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులకు సూచించిన నేపథ్యంలో ఏర్పాటు చేసినందుకు ఎంఇఒ సంతృప్తిని వ్యక్తం చేశారు.

# గుర్లగెడ్డ ప్రాజెక్టును పూర్తి చేయాలి

**ప్రజాశక్తి- మెంటాడ**

గుర్ల గెడ్డ ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మెంటాడలో సోమవారం సిపిఎం మండల మూడవ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సినిమా హాల్ జంక్షన్ నుంచి సంత తోట మీదుగా కళ్యాణ వెంకటేశ్వర స్వామి గుడి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహాసభ సూచికగా జెండా ఆవిష్కరించారు. ఇటీవల మృతి చెందిన పార్టీజాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. అనంతరం జరిగిన సభలో తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ మెంటాడ మండల సమగ్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని, ముఖ్యంగా గుర్లగెడ్డ ప్రాజెక్టును త్వరితగతిన వెంటనే పూర్తి చేసి రైతులకు

**సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మినేని**



ర్యాలీ చేస్తున్న సిపిఎం నాయకులు

సాగు భూములకు సాగునీరు అందించాలని కోరారు. గిరిజనులు, దళితులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములకి వెంటనే పట్టాలు ఇవ్వాలని, స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయిన ఇప్పటికీ గిరిజనులకి రోడ్డు సౌకర్యం లేక డోలీ మోత తప్పటం లేదని అన్నారు. వెంటనే గిరిజన గ్రామాలకి రోడ్లు, మంచినీరు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధరలు అమలయ్యేలా చట్టం చేయాలని, పెరిగిన ధరలు తగ్గించాలని, కరెంటు ఛార్జీలు తగ్గించాలని కోరారు. భవిష్యత్తులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పైన పోరాటాలు ఉధృతం చేయాలని మహాసభలో తీర్మానం చేశారు. అనంతరం మండల ఆర్గనైజింగ్ కమిటీ ఏడుగురితో ఏర్పాటు చేశారు. మండల కన్వీనర్‌గా రాకోటి రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి, నాయకులు ఆర్.హరికృష్ణవేణి, గిరిజన సంఘం జిల్లా సహాయకార్యదర్శి సోములు, అప్పలనరసయ్య, కృష్ణవేణి, పెద్ద రాము, వరలక్ష్మి, వెంకట్రావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

## క్రీడలతో మానసిక ఉల్లాసం

**ప్రజాశక్తి- డెంకాడ**

విద్యార్థులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారురాజు అన్నారు. మండలంలోని రఘు మండ జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల ఆవరణలో సోమవారం అండర్-14,17 కబడ్డీ జట్ల ఎంపిక పోటీలను వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పిల్లలు క్రీడల్లో పాల్గొ నడం వల్ల శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటారన్నారు. ఈ క్రీడలతో విద్యార్థులకు భవిష్యత్తు కూడా ఉంటుందన్నారు. చాలా మంది క్రీడల్లో రాణించి తద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటు పల్లి వెంకట్ వాసుదేవరావు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు, సర్పంచ్ గూడేల విష్ణు, స్థానిక నాయకులు సూరిబాబు, రాజు, డిప్యూటీ డిఇఒ వెంకటరమణ, స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణం రాజు, పిఇటిలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఐదో రోజూ నిరసన

**ప్రజాశక్తి- బొబ్బిలి**

స్థానిక మార్కెట్లో ఏర్పాటు చేసిన మద్యం షాపును తరలించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఐదో రోజు స్థానికులు నిరసన కొనసాగించారు. జన నివాసాల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయడం దుర్మార్గమని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు కె.పుణ్యవతి, మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం దుకాణం తరలించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

# కార్మిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**ప్రజాశక్తి- రేగిడి**

పాఠశాలల్లో పని చేసిన గ్రీన్ అబాసిడర్లు, మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు, ఆశ, అంగన్వాడీ, విఆర్‌ఎల తదితర కార్మిక, ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, జిల్లా కార్యదర్శి ఎ. జగన్మోహన్‌రావు, డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేసి, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ తొలగింపులు ఆపాలన్నారు. కార్మికులకు పనిబారం తగ్గించి, బకాయి జీతాల బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హామీలకు జీవోలు ఇవ్వాలని కోరారు. వాలంటీర్లను కొనసాగించాలని ప్రభుత్వానికి సూచించారు. స్కూలు ఆలయాలు, గ్రీన్ అంబాసిడర్ల, మధ్యాహ్నం భోజన కార్మికులకు నెలలు తరబడి జీతాలు బిల్లులు బకాయిలు ఉన్నాయని, అంగన్వాడి, ఆశాలపై పనిభారం విపరీతంగా పెరిగిందని చెప్పారు. విఆర్‌ఎలకు చాకిరీ తప్ప వేతనాల్లో పెరుగుదల

**సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్రావు**



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

లేదన్నారు. ఇసుక కొరత వల్ల భవన నిర్మాణ కార్మికులకు చేతినిండా పనిలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఎం.త్రినాథ్, గ్రీన్ అంబాసిడర్, స్కూల్ ఆయాలు విఆర్‌ఎలు తదితరులు పాల్గొన్నారు.

**వంగర:** ఆశ, అంగన్వాడీలకు పని భారాన్ని తగ్గించాలని, గత ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలకు ప్రస్తుత ప్రభుత్వం జీవోలు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, ఉచిత ఇసుక ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆశ, అంగన్వాడి, విఆర్ఎ, భవన నిర్మాణ కార్మికులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ విఆర్‌ఎలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించకుండా వెట్టి చాకిరీ చేయించుకోవడం తగదన్నారు. స్కూలు ఆయాలకు, గ్రీన్ అంబాసిడర్‌లకు మధ్యాహ్న భోజన కార్మికులకు నెలలు తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలన్నారు. అనంతరం తహశీల్దార్ డి.ధర్మరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అరటి కట్ల ఆదినారాయణ, నాగరత్నం, కుమారి, వెంకట లక్ష్మి, జి కుమారి, శశికళ, భూలోక, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాలు మరువలేనివి

**ప్రజాశక్తి- బొబ్బిలి**

పోలీసు అమర వీరుల త్యాగాలు మరువలేనిదని పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎంతోమంది పోలీసులు ప్రాణాలను త్యాగం చేసి అమరులయ్యారన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో తమ సిబ్బంది పాత్ర మరువలేనిదని చెప్పారు. అమరవీరుల ఆశయ సాధనకు పని చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**రామభద్రపురం:** పోలీసు అమర వీరుల త్యాగాలు సదా స్మరణీయమని స్థానిక ఎస్‌ఐ ప్రసాదరావు అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలో పోలీసు స్టేషన్ నుంచి 3 రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో రాత్రి పగలు ఎండా, వానా, చలి లెక్క చేయకుండా ప్రజా రక్షణలో ఉంటూ ఎంతోమంది పోలీసులు ప్రాణాలను లెక్క చేయకుండా త్యాగం చేసి అమరులయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు.

**డెంకాడ:** చింతలవలస ఐదో బెటాలియన్ వద్ద పోలీసు అమరవీరుల స్తూపం వద్ద పోలీసు అమరవీరులు సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్ అమరులైన పోలీసు వీరులకు నివాళు


జ్ఞాపికలను అందజేస్తున్న కమాండెంట్ మల్లికా గార్గ్

లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల సేవలు వెలకట్టలేనివని చెప్పారు. ఈ సందర్భంగా బెటాలియన్‌లో పనిచేసి విధి నిర్వహణలో అసువులు బాసిన 31 మంది పోలీసు కుటుంబాలకు జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ పి. సత్తిబాబు, ఐసి అడిషనల్ కమాండెంట్ జివి. ప్రభాకర్‌రావు, అసిస్టెంట్ కమాండెంట్ జి. లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

# శిలాఫలకం ధ్వంసం

**ప్రజాశక్తి- డెంకాడ**

పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలో బొడ్డవలస గ్రామంలో పలు అభివృద్ధి పనులకు నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారు రాజు, ఎంపిపి బంటుపల్లి వెంకట్ వాసుదేవరావు ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. శంకుస్థాపన చేసి వెళ్లిన గంట వ్యవధిలోనే శిలాఫలకాన్ని గుర్తు తెలియని దుండగలు కూల దోశారు. ఈ విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో టిడిపి,జనసేన నాయకులు ఫిర్యాదు కూడా చేశారు. ఆ గ్రామంలో జనసేనలో రెండు గ్రూపులు ఉన్నాయని అందులో ఒక గ్రూపు వారు ఈ పని చేసి ఉంటారని మరో గ్రూపు ఆరోపిస్తుంది. శిలాఫలకాన్ని కూల్చి వేసిన విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్లారు.


ధంసమైన శిలాఫలకం

# అమ్మడమ్మకు ఘన నివాళి

**ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్**

అనారోగ్యంతో మరణించిన విశాఖ డెయిరీ డైరెక్టర్ శంబంగి అమ్మడమ్మకు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల అధికారులు, ప్రజలు ఘనంగా నివాళులర్పించారు. అమ్మడమ్మ మృత దేహాన్ని సోమవారం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు సందర్శించి నివాళు లర్పించారు. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పల నాయుడు, వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల నాయుడు, అమ్మడమ్మ కుమారుడు శంబంగి బుజ్జి, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

**అమ్మలు మృతి పాడి రైతులకు తీరని లోటు**

**రామభద్రపురం:** విశాఖ డెయిరీ ప్రాంతీయ డైరెక్టర్ శంబంగి అమ్మలు మృతి ఈ ప్రాంత పాడి రైతులకు తీరని లోటని స్థానిక ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, స్థానిక విశాఖ డెయిరీ పాలకేంద్రం అధ్యక్షులు చొక్కాపు రామకృష్ణ అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం ఆమె మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దకాలంగా అమ్మలు డెయిరీ డైరెక్టర్‌గా ఉత్తమ సేవలు అందించి పాడి రైతుల శ్రేయస్సుకు కృషి చేశారన్నారు. ఆదివారం ఆమె మృతి చెందినట్లు సమాచారం రావడంతో దిగ్భ్రాంతికి గురయ్యామన్నారు. అమ్మడమ్మ అనే పేరుతో ఈ ప్రాంత రైతులకు ఆమె సుపరిచితురాలని, పాల సంఘాల ఏర్పాటుకు ఆమె చేసిన కృషి, సేవలు మరువలేనివని కొనియాడారు. డెయిరీ ఉద్యోగులను సమన్వయపరచి వారి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి ఇటు రైతులకు అటు యాజమాన్యానికి, ఉన్నతాదికారులకు మధ్య వారధిగా పనిచేసే వారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక డెయిరీ మేనేజర్ రామచంద్రరావు, వివిధ పాల సంఘాల అధ్యక్షులు, కార్య దర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**ప్రజాశక్తి - నెల్లిమర్ల**

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవి శేఖర్ అన్నారు. సోమవారం ఆయన వల్లూరు, మల్యాడ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదని సిసి రహదార్లు, కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అందుకే కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, వల్లూరు సర్పంచ్ పంచాది జయలక్ష్మి, ఎంపిటిసి లెంక రాజేశ్వరి, నాయకులు పంచాది సూర్యనారాయణ మాస్టర్, పంచాది జగన్, లెంక సన్యాసిరావు, మాల్యాడ నాయకులు పొట్నూరు లక్ష్మణ, పి. అప్పల నాయుడు, ఎం. శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

**మెంటాడ:** మెంటాడలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎంపిటిసి పతివాడ కుమారి, రాయిపిల్లి రవిశంకర్ సచివాలయ ప్రాంగణంలో కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. అనంతరం గ్రామ సమస్యలపై చర్చించి ప్రజలకు తక్షణం అవసరాల పనులను గుర్తించి నిధులు కేటాయించాలని అధికారుల వద్ద ప్రస్తావించారు. ఈ కార్యక్రమం లో ఎపిఒ చినప్పయ్య, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, విఆర్ఒ అప్పలనాయుడు, హైస్కూల్ కమిటీ చైర్మన్ కన్నబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ సువ్వాడ గౌరినాయుడు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**మెరకముడిదాం:** పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా పల్లెలు పరిశుభ్రంగా తయారవుతున్నాయని టిడిపి నాయకులు అన్నారు. సోమవారం మండలంలోని గర్భాం, బైరిపురం పంచాయతీలో పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భాంలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి టిడిపి మండల నాయకులు తాడ్డి శ్రీధర్, తాడ్డి చంద్రశేఖర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ప్రజాశక్తి- బొబ్బిలి**

స్థానిక షాదిఖానా సమీపంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో ఉండడంతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తుండగా షాదిఖానా సమీపంలో సొమ్మసిల్లి కిందపడిపోయి మరణించాడు. స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిస్తే తమను సంప్రదించాలని పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ చెప్పారు. పూర్తి వివరాలకు 9121109422, 9121109454 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

**ప్రజాశక్తి- మెంటాడ**

స్థానిక గద్దించెట్టు వద్ద రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఆంధ్ర పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. కొనిశ గ్రామానికి చెందిన పాకలపాటి అప్పల నరసింహరాజు(57) తన ద్విచక్ర వాహనంపై ఆగూరు వెళుతుండగా మెంటాడ గద్దించెట్టు వద్ద ఎదురుగా రాజస్థాన్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు బైక్‌పై స్పీడుగా వచ్చి ఢీకొన్నారు. దీంతో అప్పలనరసింహరాజుకు తీవ్రగాయాలయ్యాయి. ఆయన్ను స్థానిక పిహెచ్‌సికు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఆంధ్ర ఎస్‌ఐ కె సీతారాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం గజపతినగరం కమ్యూనిటీ ఆసుపత్రికి మృత దేహాన్ని తరలించారు.

## కిరీటాల దొంగ పట్టివేత

**ప్రజాశక్తి- నెల్లిమర్ల**

ఈ నెల 14వ తేదీ రాత్రి మండలంలోని దేవుని నెలివాడ గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు చెందిన రెండు వెండి కిరీటాల దొంగతనానికి గురైన విషయం తెలిసిందే. ఈ దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఆలయంలో ఉన్న ఉత్సవ విగ్రహాలకు తొడిగి ఉన్న 10 గ్రాముల రెండు వెండి కిరీటాలు, హుండీలోని రూ. 3వేలు దొంగిలించిన లావేరు మండలం ఇజ్జాడ పాలెం గ్రామానికి చెందిన గౌరీ ప్రసాద్‌ను సోమవారం ఉదయం అరెస్టు చేసి అతని వద్ద 10 గ్రాముల వెండి కిరీటాలు, రూ.2500 నగదు రికవరీ చేసినట్లు ఎస్‌ఐ గణేష్ వెల్లడించారు.

# ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి

**ప్రజాశక్తి- మెంటాడ**

ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సామాజిక నేపథ్యాన్ని సోమవారం యుటిఎఫ్ నేతలు పరిశీలించారు. పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీష్ రెండు మీడియంలు అమలు చెయ్యాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు వెల్లడించారు. పాఠశాలలో ఇంగ్లీష్ భోధనకు ప్రత్యేకంగా ఉపాధ్యాయులను కేటాయించాలని, 10వ తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తి చేసిన తరువాత సెల్ఫ్ టెస్ట్‌లు పెట్టాలని, రోజు రోజుకు పెరుగుతున్న భోధనేతర పనులు రద్దు చెయ్యాలని కోరారు. ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులలో 40శాతం మంది ఇంగ్లీష్

**యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు వెల్లడి**

మీడియంలో పరీక్ష రాయడానికి ఇబ్బంది పడుతున్నారని 10వ తరగతి పబ్లిక్ పరీక్ష రాసే విద్యార్థులకు నచ్చిన మీడియంలో పరీక్ష రాసే అవకాశం ప్రభుత్వం కల్పించాలని అన్నారు. రానున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉపాధ్యాయులు అందరూ ఓటు నమోదు చేసుకోవాలని కోరుతూ మండలంలో గల ఉన్నత పాఠశాలలను సందర్శించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఎస్ సబ్ కమిటీ కన్వీనర్ పి రాంప్రసాద్, మెంటాడ మండల ప్రధాన కార్యదర్శి కొండపల్లి సత్యనారాయణ, కోశాధికారి బి. మురళి, జిల్లా కౌన్సిలర్ చింతా వెంకట రవికుమార్ పాల్గొన్నారు.

## పవన్‌కు వినతి

**గుర్ల:** నెల్లిమర్ల జ్యూట్‌మిల్లును తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని సిఐటియు అనుభంద సంఘం జ్యూట్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. సోమవారం నెల్లిమర్ల జ్యూట్‌మిల్లును తెరిపించాలని కోరుతూ డిప్యూటి సిఎం పవణ్ కళ్యాణ్‌కు గుర్లలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముడి సరుకు కొరత పేరిట యాజమాన్యం మిల్లును మూసి వేసి 6నెలలు గడుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మిల్లు మూసి వేయడం వల్ల కార్మికులు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మిల్లు తిరగడానికి కార్మికులు 5,10, 18 రూపాయలు జ్యూట్ యాజమాన్యానికి అప్పు ఇచ్చారని తిరిగి కార్మికులకు ఒక్కొక్కరికి రూ.52,600 చెల్లించాల్సి ఉన్నా ఇంతవరకు ఇవ్వలేదని గుర్తు చేశారు. జ్యూట్ యాజమాన్యం ఇఎస్‌ఐ, పిఎఫ్ బకాయిలు ప్రభుత్వానికి చెల్లించక పోవడంతో రిటైర్డు కార్మికులు ఫించన్, ఇఎస్‌ఐ సౌకర్యాలు పొందలేక పోతున్నారని తెలిపారు. కాగా 2016 నుంచి రిటైర్డు కార్మికులకు గ్రాడ్యూటీ బకాయిలు కూడా చెల్లించలేదని చెప్పారు. ఈ సమస్యల పై జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినా ఇంత వరకు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మిల్లు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని వినతి పత్రంలో డిమాండ్ చేశారు.